# ప్రేమానురాగాలు

— కొండా చంద్రశేఖర రెడ్డి.

అరుణ గార్కి,

కొద్ది క్షణాల క్రితమే మీ ఉత్తరం అందుకొని సంతోషించాను. ఎప్పటిలా నా స్నేహితులను చూసి పొంగిపోవాలనుకున్నాను. కానీ ఆ ఉత్తరం పూర్తిగా చదివిన తర్వాత, దాన్ని నా స్నేహితులకు చూపే ముందు, నాగురించి నిజాలను దాచకుండా మీకు రాస్తున్నాను. ఈ ఉత్తరం చదువుతున్నంత సేపూ, చదివాక ఎటువంటి ఉద్వేగానికీ లోనుకావద్దని ప్రార్థిస్తున్నాను. అలా అయితేనే ఈ లేఖను ఆసాంతం చదవగలరు. లేని పక్షంలో చెత్తబుట్టలో పారేయండి.

నిజానికి నేను ఓ అనాథను. చిన్నప్పుడే అమ్మా నాన్నలు పోయారు. బంధువులు ఎవ్వరూ ఆదరించలేదు. ఓ పెద్ద మనిషి నన్ను ఓ అనాథాశ్రమంలో చేర్పించాడు. అక్కడ నేను అందరి పిల్లతోపాటు పెరిగాను. అయితే నేను ఎక్కువగా ఒంటరిగా గడిపిన వాణ్ణి. బయటి ప్రపంచంతో నా వయసున్న పిల్లలు వాళ్ళ అమ్మా నాన్నలతో ఎంతో ఉల్లాసంగా గడుపుతోంటే నాలో ఈర్ష్య చెలరేగేది. నాకు నిజమైన ఆప్యాయత, అనురాగాలంటే ఏమిటో తెలియదు. ఎప్పుడూ సంతోషంగా వుండే బయటి ప్రపంచం నన్ను వెక్కిరించినట్టుండేది. అందుకే ఆశ్రమం విడిచి ఎప్పుడో బయటకు రావాలన్పించేది కాదు. ఆశ్రమంలోనే వుంటూ ఇంటర్‌మీడియట్ పూర్తి చేశాను. ఆ తర్వాత చదువుపై ఆసక్తి సన్నగిల్లింది. కారణం కాలేజీకి వెళ్ళేటప్పుడు అందరిలా మంచి డ్రెస్‌లు, కొత్త పుస్తకాలు, కాళ్ళకు మంచి చెప్పులు లేకపోవటమే కావచ్చు. చదువు ఆపేశాక ఆశ్రమంలో నాపేరుపై వచ్చే స్కాలర్‌షిప్ ఆగిపోయింది. అప్పట్నించి నాకు కష్టాలు ప్రారంభమయ్యాయి.

ఆశ్రమంలో తినడానికి తిండి లభించేది కాని, చేతి ఖర్చులకు నావద్ద డబ్బుండేది కాదు. అందువల్ల తిండి తిని బయట ఆవారాగా తిరగడం మరిగాను. ఆ కాలంలో కొంతమంది నాలాంటి వాళ్ళతోనే పరిచయం కలిగింది. వారానికి రెండు మూడు రోజులు కష్టపడి డబ్బు సంపాదించడం, వాటిని ఎన్నో రకాలుగా ఖర్చు పెట్టడం అలవాటయ్యింది. ఆ క్రమంలో సినిమా హాళ్ళ దగ్గరా, బస్టాపుల దగ్గరా నా స్నేహితులతో చేరి ఆడపిల్లల్ని ఏడిపించేవాణ్ణి. కొన్ని సార్లు తప్పించుకున్నా గానీ, ఒకసారి పోలీస్‌స్టేషన్లో ఒకరోజు వుండాల్సొచ్చింది. సంపాందించిన డబ్బుతో జల్సా చేయడం మరిగిన నాకు ఫోన్లో ఆడపిల్లల్ని అల్లరి పెట్టడం కూడా నేర్పారు నా స్నేహితులు. రెండు మూడు మార్లు పోలీసుల బారి నుంచి క్షణాల్లో తప్పించుకుని, మేం సాధించిన విజయానికి ఎంతగానో పొంగిపోయాం.

ఓరోజు ఓ ఇరానీ హోటల్లో కూర్చుని వీక్లీ తిరగేస్తోంటే ఒక అమ్మాయి అడ్రస్ కన్పించింది. ఆ పేజీ తీసి చూస్తే అది కలం స్నేహం పేజీ. ఆ అమ్మాయి అడ్రస్ కోసం ఆ పేజీ చించి జేబులో పెట్టుకొంటుంటే అది చూసిన ఆ హోటల్ ప్రొప్రైటర్ ఏదో అనబోయి, మా గ్యాంగును చూసి నీళ్ళు నములుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత చాలా రోజులకు ఆ అడ్రస్ జ్ఞప్తికి వచ్చి, స్నేహం కోరుతున్నట్టు ఉత్తరం రాశాను. వెంటనే వారం రోజుల్లో జవాబు వచ్చింది. ఆ లెటర్‌ను నా స్నేహితులకు చూపాలనుకుని, ఆ అమ్మాయికి క్యాన్సర్ జబ్బు ముదిరిపోయిందని రాసి వుండటం వల్ల దాన్ని చూపలేదు. ఆ అమ్మాయిని వదిలేసి వేరే వేరే అడ్రస్‌లకు ఉత్తరాలు రాయడం ప్రారంభించాను. అయితే రెండోసారి నేను రాసిన ఉత్తరంలో తన జబ్బును గురించి ఆలోచించవద్దనీ, ఆ విషయాన్ని అసలు ఉత్తరంలో ప్రస్తావించవద్దనీ రాశాను. అయితే ఆ విషయాలు నేను మనస్ఫూర్తిగా రాసినవి కావు. తన నుంచి వచ్చే లేఖల్లో జబ్బు ప్రస్తావన వుంటే ఆ లేఖల్ని నా స్నేహితులకు చూపలేనేమో అనే అనుమానం. నేను ఒక అమ్మాయి స్నేహాన్ని అయాచితంగా పొందుతున్నాననే గర్వం. నాకు మాత్రమే ప్రత్యేకించి రాసే ఉత్తరాల్ని నా స్నేహితులకు చూపాలనే కోరికను కోరికను కలిగించేది. నేను ఏదో రూపంలో, అంటే జూదంలోనో, మరో పందెంలోనో గెలిచిన డబ్బును అందమైన ఉత్తరాల కవర్ల కోసం ఉపయోగించాల్సి వచ్చేది.

నేను ఒక మంచి చదువు చదివాననీ, ఆఫీసరుగా జాబ్ వస్తుందనీ, ఆనక జీవితం సుఖంగా వుండేందుకు మంచి ఇల్లు, ఫర్నిచర్ ఇప్పట్నించే ఏర్పాటు చేసుకుంటున్నాననీ రాశాను. ఆమె తన జవాబులో నా భవిష్యత్తు ప్రణాళికను చదివి ఎంతో ముగ్ధురాలైనట్టు రాసింది. ఆ తర్వాత రాసిన ప్రతి లేఖలో నా ఊహాశక్తిని ఉపయోగించి ఎన్నో అందాల గాలిమేడలను ఊహలతో నిర్మించి, ఆమెకు నివేదించాను.

నేను రూపొందించిన అందమైన మాయా లోకంలో ఆమె ప్రవేశించింది. అప్పట్నుంచి లేఖల్లో ఇంకా ఏదో తెలియని భావాల్ని రంగరించి రాయడం మొదలుపెట్టాను. నేను నా గొప్ప ఆఫీసర్ హోదా గురించి రాశాను. దానిపై ఆమెకు నమ్మకం కలిగేందుకు ఒక వాచీని బహూకరిద్దామనుకున్నాను. కానీ నా దగ్గర రోజువారీ ఖర్చులకే డబ్బులేదు, ఇక వాచీకి ఎక్కడ్నించి తేను? అందుకే చిన్న దొంగతనానికి పాల్పడి దొరికిపోయాను. కొంతకాలం జైల్లో వున్నాను. ఆ కాలంలో కొన్ని కారణాల వల్ల ఆమెకు ఉత్తరాలు రాయడం సాధ్యం కాలేదు. ఇక నా స్నేహితుల ముందు నా గొప్పతనం చూపలేననుకున్నాను. కానీ జైలు నుంచి వచ్చాక ఆశ చావక ఒక ఉత్తరం రాసి చూశాను. తాను నా ఉత్తరాల కోసం ఎంతగా ఎదురు చూసిందో ఎంతో హృద్యంగా వివరించింది. నేనెంతో గర్వపడ్డాను. నేదో ఉబుసుపోక చేసే స్నేహం ఇంత రసమయ ఘట్టంగా, ఈ స్థాయికి చేరుకొంటుందని ఊహించలేకపోయాను. ఒక నెల పాటు ఉత్తరాలు రాయకపోవడానికి కారణం విదేశాలు వెళ్ళడమేనంటూ జవాబిచ్చాను. ఆమె తాను రాసిన లేఖలో నా గొప్పతనం, కీర్తి ప్రతిష్ఠలు విదేశాలకే కాదు, దిగంతాలకు కూడా వ్యాపించాలని కోరుకుంటున్నట్టు రాసింది. ఏదో అక్షరాల అమరికతో ఎదుటి వ్యక్తిని ఇంతగా నమ్మించగలిగినందుకు నా సృజనాత్మకతకు నేనే ఎంతో పొంగిపోయాను. ఆ తర్వాత మామధ్య ఎన్నో లేఖామృతభాండాలు దొర్లిపోయాయి. నేను హాలాహలాన్ని అమృతంగా భ్రమింపజేస్తే, అటు




Illustration: AKBAR

నుంచి మాత్రం నిజంగా అమృతమే జాలువారేది.

కొన్నాళ్ళ తర్వాత నేనే కాస్త ముందుకు వెళ్ళి తనను ప్రేమిస్తున్నానంటూ తెలియజేశాను. రోగగ్రస్తురాలైన తనను ప్రేమించగల గొప్పదనం నాలో వుండొచ్చు గానీ, తనకు అంత అర్హత లేదంటూ జవాబిచ్చింది. తన జీవిత చరమాంకంలో ఒక వ్యక్తి తనతో ఇలా అనటం తనకు మానసికంగా ఎంతో శక్తినిస్తుందని చెప్పింది. నా గొప్పదనం గురించి రమణీయంగా వర్ణిస్తూ, ఒకవేళ తనకు నిజంగా అవకాశం వుండి వుంటే నన్ను వివాహమాడుతానంటూ రాసింది. అయితే నేను మాత్రం ఇంకో రెండ్రెళ్ళల్లో తనను ఎట్టి పరిస్థితుల్లోనైనా వివాహమాడతానని జవాబిచ్చాను. అదీ ఎంతో నమ్మకం కలిగేటట్టుగా. అయితే నా ఉద్దేశం ఇంకోలా వుంది. ఎలాగూ ఇవాళో, రేపో అన్నట్టున్న ఆమెను పెళ్ళాడితే నలుగురిలో ఒక సంస్కర్తగా గుర్తింపు వస్తుందని ఆశ, ఆమె పోయాక ఆమెకున్నటువంటి ఆస్తి నాదవుతుందనీ, అందరూ ఆమెను గురించి మరచిపోయాక, ఆ ఆస్తి ఆధారంగా చూపి ఇంకొకరిని పెళ్ళి చేసుకోవాలనే ఒక గొప్ప ఆశ. అయితే ఆ ఆలోచనలన్నింటినీ తుడిచిపారేస్తూ ఆమె నుంచి ఒక లేఖ నాకు అందింది. దానిలో తన జబ్బు పూర్తిగా నయమైందని రాసింది. ఎంతోమంది డాక్టర్లు శ్రమించి ఒక దారిలో పెట్టలేని తన జీవితాన్ని నా లేఖల్లోని ప్రతి అక్షరం సంజీవనిలా పనిచేసి తన జబ్బును పూర్తిగా పారదోలినట్టు సారాంశం.



## సౌందర్యకి పెరిగిన ఫాలోయింగ్

మగాళ్ళతో సమానంగా మహిళా ప్రేక్షకుల ఫాలోయింగ్ కూడా ఎక్కువగా ఉన్న ఏకైక నటి సౌందర్య. ఇటీవల ఆమె నటించిన 'అంతఃపురం' సినిమాలో ఒక సన్నివేశంలో సౌందర్య బుగ్గమీద కుంకుమని హీరో సాయికుమార్ నోటితో ఊదితే బుగ్గ సొట్ట పడే సీను గురించి కాలేజీ అమ్మాయిలూ, ఇంట్లో వంట చేసుకునే ఆడవాళ్ళూ కూడా తెగ మెచ్చుకుంటున్నారు.

నా లేఖల్లో వున్న ప్రతి అక్షరం, నేను పొంగించిన స్నేహం, ప్రేమ అనే రెండు అమృతమైన పదాలు వాటి మాటున వున్న ఒక గొప్ప భావ వాతరంగం తనను బ్రతికించినట్టు డాక్టర్ల ద్వారా తెలుసుకొన్నదట!

నేను మొదట్లో ఉత్తరాల్లో నా స్వార్థం కోసం తన జబ్బును మర్చిపొమ్మనీ, జబ్బు సంగతి లేఖల్లో ఇకపై ప్రస్తావిస్తే ఒట్టేననీ రాస్తే ఆ మాటలు ఆవిడ మనసుపై నిజంగానే పనిచేసి ఆవిడ ప్రాణాలు నిలిపాయనీ తెలుసుకున్నాను.

అసలు నాకు ఇప్పటి వరకూ ప్రేమ, అనురాగం, ఆప్యాయత అనే అంశాలపై అసలు నమ్మకం లేదు. ఎందుకంటే నా జీవితంలో నిజమైన ప్రేమాను రాగాలను ఎవ్వరూ పొందలేదు. ఆ పదాలను కవులు కవితలు రాయడానికి ఉపయోగిస్తారని అనుకున్నానే గానీ, నిజ జీవితంలో వాటి ప్రాముఖ్యత వుందని తెలుసుకోలేకపోయాను. ప్రాణాల్ని సైతం నిలిపే గొప్పదనం ఆ చిన్న చిన్న పదాల్లో వుందని భావించలేకపోయాను. జీవితమంటే స్నేహ సంబంధాలకోసం, ప్రేమానురాగాల కోసం అనీ, అవి వుంటేనే జీవితం పరిపూర్ణం అనీ నాకు తెలియదు. ఏదో చిన్నా, పెద్దా మోసాలు, మాయ మాటలు చెప్పి జీవితాన్ని గడుపుదామనుకున్నానే గానీ, జీవితతం అంటే ఏమిటో ఇప్పుడు తెలుసుకోగలిగాను. ఏదో కొంత కాలం స్నేహం, ప్రేమ నటించి, ఆస్తిని కాజేయాలనుకున్నాను. నేను కావాలని చెప్పిన మోసపూరిత మాటలు, నా స్వార్థపు ఆలోచనలు పొదిగి వుంచుకున్న అక్షరాలు వాటి విధిని నిర్వర్తించలేకపోయాయి.

ఆమెను తిరిగి మనిషిని చేసిన ఆ అందమైన అబద్ధాలు ఆమె మనసును చేరి వాటిలోని పాపపు ఆలోచనల్ని, మోసపూరిత వ్యూహాల్ని వదిలించుకుని ప్రక్షాళనమయ్యాయి. దీనికంతటికీ కారణం ఆమె నిర్మలమైన మనసు అని ఇప్పుడే తెలుసుకోగలిగాను. ఆమె నిర్మలమైన, నిష్కల్మషమైన ఊహలు, నా మోసపూరిత మాటల్ని అపూర్వ సంజీవనిగా మార్చివేశాయి. కాలకూట విషాన్ని సూతం కరుణతో కూడిన అమృతంగా మార్చగల శక్తి మంచి మనసుకు వుంటుందని గ్రహించాను. ఆమె గతంలో రాసిన ఉత్తరాల్లోని నిర్మలత్వాన్ని నిజాయితీతో కూడిన స్నేహాన్ని నేను లక్ష్యపెట్టలేదు. కానీ ఆమె రాసిన చివరి ఉత్తరం నాలో ఎన్నో మార్పులు తెచ్చింది. ఆ లేఖ ప్రేమానురాగాల గొప్పదనం తెలియజేసిన గొప్ప గ్రంథం. ప్రేమానురాగాలను సరైన దారిలో ఉపయోగిస్తే అవి మనకు కలుగజేసే ఆనందం ఎలా వుంటుందో కన్నులకు కట్టినట్టు చూపిన ఓ మహాకావ్యం. అందమైన అబద్ధాలను చెప్పి నాకు తెలియకుండానే ఆమె ప్రాణాన్ని నిలబెట్టినందుకు సంతోషించాలో, అవే మాటలతో ఆమె కట్టుకున్న అత్యద్భుత ఆశా సౌధం నిలువునా కూలిపోతోంటే విచారించాలో తెలియని అయోమయ స్థితిలో వున్నాను. ఇన్ని అపనమ్మకమైన పనులు చేశాక, చివర్లో నేను చేసిన పొరపాటును సరిదిద్దుకుంటున్నాననీ, నేను చేసిన తప్పుకు పశ్చాత్తాప పడుతున్నాననీ చెబితే ఆమె నన్ను నమ్మగలదా? నమ్మినా నన్ను క్షమించగలదా?

ఆమె ఊహాసౌధ నిర్మాతనైన నేను ఓ సోమరిననీ, నిరుద్యోగిననీ, ఓ అనాథననీ తెలియగానే ఆమె భరించగలుగుతుందా? ఆమె చావును నేను ఉపయోగించుకోవాలనుకున్న తీరును చూసి నన్ను అసహ్యించుకోకుండా వుంటుందా?

నేను ఈ ఉత్తరంలో రాసిన "ఆమె" నీవని నాకూ, నీకూ, ఇద్దరికీ తెలుసు. నేనీ ఉత్తరం ఎంతో క్షోభను అనుభవిస్తూ, పశ్చాత్తాపంతో రాస్తున్నాను. ఇవి ఎంతో మానసిక వ్యథతో రాస్తున్న అక్షరాలు. ప్రతి అక్షరం వెనుకా అంతులేని ఆవేదన, కన్నీళ్ళూ దాగి వున్నాయి. ఈ ఉత్తరంలో నా నిజస్వరూపాన్ని చూసిన నువ్వు, నన్ను అసహ్యించుకుంటావని తెలుసు. నా మొహం చూస్తేనే పంచమహాపాతకాలు చుట్టుకుంటాయని నువ్వు అనుకుంటావనీ తెలుసు. నా గురించి ఇన్ని విషయాలు తెలిశాక నన్ను క్షమించలేవనీ తెలుసు. కానీ ఏమూలో దాగి వున్న ఆశ, నన్ను కరుణించి మంచి మనసుతో క్షమిస్తావన్న నమ్మకాన్ని చిగురింపజేస్తోంది. నాగురించీ, నా దుష్ప్రవర్తన గురించీ తెలుసుకున్న నువ్వు నాతో స్నేహబంధం సాగించడానికి కూడా అస్సలు ఇష్టపడవనీ తెలుసు. కానీ ఆ స్నేహ బంధాన్ని తెంపి వేసేముందు నన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తున్నానంటూ ఉత్తరం రాస్తే, నన్ను క్షమించిన క్షణం నుంచే నేను ఓ కష్టజీవిగా మారిపోతాను. ప్రేమాను రాగాల విలువ తెలుసుకున్న నేను సోమరితనాన్ని వదిలి సంతోషంగా జీవిస్తాను. నీవు నన్ను క్షమించకపోతే నేను చేసే పాపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ జీవితానికి చరమ గీతం పాడేస్తూ ఈ లోకం నుంచి నిష్క్రమిస్తాను. మరో జన్మంటూ వుంటే నీ స్నేహితుడిగానే జన్మిస్తాను.

## సన్నీడియోల్ వ్యవహారం

సన్నిడియోల్‌ని హీరోగా పెట్టి బయట నిర్మాతలెవరూ సినిమా తీయడానికి ముందుకు రాకపోవడంతో ఇప్పుడు స్వంతంగానే సినిమాలు తీసుకుంటున్నాడు. కానీ పాత తిరుగుళ్ళు మాత్రం ఇప్పుడు బాహాటంగా చేస్తున్నాడు. మధ్యాహ్న భోజనాన్ని డింపుల్ ఇంట్లోనూ, రాత్రికి రవీనా టాండన్ ఇంట్లోనూ చేస్తున్నాడట.

